సాక్షి
వికారాబాద్

మంగళవారం । 6 । మే । 2025



'రుణం' తీరదా..?

పరిగి మండలంలో పంట రుణాలు మాఫీ కాకపోవడంతో పలువురు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. 8లో▸



కులగణన దేశానికే ఆదర్శం

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే దేశానికే ఆదర్శంగా నిలిచిందని పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 8లో▸



బకాయిలు చెల్లించాలి

ఉపాధి కూలీలకు బకాయి వేతనాలు వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం నేతలు డిమాండ్ చేశారు. 9లో▸

ఖాళీల పర్వం!



వికారాబాద్ కలెక్టరేట్

సంక్షేమ శాఖల్లో భర్తీకాని హెచ్‌ఓడీ పోస్టులు

- ఇన్‌చార్జులతో సరిపెడుతున్న వైనం
- మిగతా శాఖలదీ అదే పరిస్థితి
- గాడితప్పుతున్న పర్యవేక్షణ

వికారాబాద్: జిల్లాలో పలు శాఖలకు హెచ్‌ఓడీలు లేకపోవడంతో పర్యవేక్షణ గాడితప్పుతోంది. పలు కీలక శాఖలకు జిల్లా అధికారులు లేకపోవడం ఇబ్బందిగా మారింది. కొన్ని శాఖల అధికారులు బదిలీపై వెళ్లడంతో ఖాళీగా మారగా.. మరి కొన్ని శాఖలు ఉద్యోగ విరమణలతో ఖాళీలు ఏర్పడ్డాయి. ఇంకొన్ని పదోన్నతిపై వెళ్లడంతో ఖాళీగా మారాయి. ఆయా శాఖలకు ఏడాది గడిచినా హెచ్‌ఓడీలను నియమించకపోవడంతో పర్యవేక్షణ గాలిలో దీపంలా మారింది. హెచ్‌ఓడీల స్థానంలో ఇన్‌చార్జ్‌లను నియమించి చేతులు దులుపుకొంటున్నారు. ఉన్నతాధికారులు సైతం పర్యవేక్షించడం లేదు. సమీక్షలు నిర్వహించకపోవటంతో హెచ్‌ఓడీలు లేని లోపం స్పష్టంగా కనిపిస్తోంది. సీఎం సొంత జిల్లాలో శాఖలన్నీ ఇలా ఖాళీగా మారుతుంటే ఎవరూ పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఈ విషయంలో ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు కనీసం పట్టించుకున్న పాపాన పోవడంలేదు.

ఇతర శాఖల్లోనూ..

జిల్లాలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రాహుల్ శర్మ ఏడాదిన్నర క్రితం పదోన్నతిపై వెళ్లగా అప్పటి నుంచి ఆ పోస్టు ఖాళీగానే ఉంది. ఆ బాధ్యతలు ప్రస్తుతం జిల్లా పరిషత్ సీఈఓ సుధీర్ చూస్తున్నారు. అదేవిధంగా జెడ్పీ డిప్యూటీ సీఈఓ పోస్టు కూడా ఏడాదిన్నరగా ఖాళీగానే ఉంది. ఇంటర్ జిల్లా నోడల్ అధికారి పోస్టు ఖాళీగా ఉండటంతో స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌కు ఆ బాధ్యతలు అప్పగించారు. జిల్లా డైట్ కళాశాలల పర్యవేక్షణాధికారి పోస్టు ఖాళీగా ఉండటంతో ఆ బాధ్యతలు స్థానిక ప్రభుత్వ డైట్ కళాశాల ప్రిన్సిపాల్‌కు అప్పగించారు. జిల్లా లేబర్ ఆఫీసర్ పోస్టు సైతం ఖాళీగానే ఉంది. ఈ బాధ్యతలు శంషాబాద్ లేబర్ ఆఫీసర్ వాళ్యకు అప్పగించారు. తాండూరు అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ పోస్టు ఖాళీగా ఉండటంతో షాద్‌నగర్ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. జిల్లా ఆస్పత్రిలో అకాడమిక్ అధికారిగా ఉన్న వెంకటరవణకు డీఎంహెచ్‌ఓగా బాధ్యతలు అప్పగించారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ బాబు మోజెస్ ఆరు నెలల క్రితం మేడ్చల్ జిల్లాకు బదిలీపై వెళ్లగా పోస్టు ఖాళీ అయ్యింది. దీంతో అతనికే ఇక్కడి బాధ్యతలు అప్పగించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చిన మోహన్‌రెడ్డి ఇటీవల జేడీఏగా పదోన్నతి కల్పిస్తూ సంగారెడ్డి ఆత్మా పీడీగా పోస్టింగ్ ఇచ్చారు. ఇక్కడ డీఏఓ పోస్టు ఖాళీ అవడంతో అతనికే అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇలా జిల్లాలో మెజార్టీ అధికారుల పోస్టులు ఖాళీగా మారడంతో పర్యవేక్షణపై తీవ్ర ప్రభావం పడింది. ఖాళీలను భర్తీ చేయాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

హెచ్‌ఓడీ పోస్టులన్నీ..

జిల్లాలో సంక్షేమ శాఖలు హెచ్‌ఓడీలు లేక ఒక్కొక్కటిగా ఖాళీ అవుతున్నాయి. ఏడాదిన్నర క్రితం మైనార్టీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి పదవీ విరమణ పొందడంతో ఆ పోస్టు ఖాళీ అయ్యింది. ఆ పోస్టును క్రీడలు మరియు యువజన విభాగం శాఖ చూసే అధికారికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇటీవల క్రీడలు యువజన విభాగం చూసే హన్మంతరావు కూడా ఉద్యోగ విరమణ పొందారు. దీంతో మైనార్టీ సంక్షేమ శాఖతోపాటు క్రీడలు మరియు యువజన విభాగం శాఖ కూడా ఖాళీ అయ్యింది. ఈ రెండు శాఖలతో పాటు మాతా స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఆరు నెలలుగా ఆ పోస్టు కూడా ఖాళీగా ఉంది. ఈ పోస్టు జిల్లా పంచాయతీ అధికారికి అదనపు బాధ్యతలు ఇచ్చారు. ఇక మరో సంక్షేమ శాఖ అయిన ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సైతం ఇటీవల పదవీ విరమణ పొందడంతో ఆ పోస్టు కూడా ఖాళీగా మారింది. డీటీడీఓ పోస్టు మినహా జిల్లాలోని సంక్షేమ శాఖల హెచ్‌ఓడీ పోస్టులన్నీ ఖాళీగా మారాయి. ప్రస్తుతం ఇన్‌చార్జ్‌లతో ఆ శాఖలను నెట్టుకొస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చిత్రంలో స్పీకర్ ప్రసాద్‌కుమార్, వ్యవసాయ శాఖ చైర్మన్ కోదండరెడ్డి, కలెక్టర్ ప్రతీక్‌జైన్

సాగులో మనమే అగ్రగామి

- జూన్ 2న రైతులకు ఫౌండేషన్ సీడ్స్ పంపిణీ
- 'రైతుల ముంగిట శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో మంత్రి తుమ్మల

ధారూరు: పంటల సాగు, దిగుబడుల సాధనలో తెలంగాణ దేశంలోనే అగ్రగామిగా ఉందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. వికారాబాద్ జిల్లా ధారూరులోని రైతువేదికలో సోమవారం నిర్వహించిన 'రైతుల ముంగిట శాస్త్రవేత్తలు' కార్యక్రమాన్ని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న రైతులందరికీ ఫౌండేషన్ సీడ్స్ పంపిణీ చేస్తామని తెలిపారు. ఈ విత్తనాలతో పండించిన పంటను నేరుగా విక్రయించకుండా ఆయా గ్రామాల్లోని ఇతర రైతులకు విత్తనంగా అందిస్తే, విత్తనాలను కొనుగోలు చేసే బాధ తప్పుతుందన్నారు. రైతు పండించే విత్తనం నాణ్యమైనదని, మోసం జరిగే వీలుండదని చెప్పారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో పంటలు సరిగ్గా పండకున్నా, ఎకరా భూమి అమ్మితే రూ. కోట్లు వస్తాయని, ఒక్క ధారూరు మండలంలోనే 5 వేల ఫాంహౌస్‌లు ఉన్నాయంటే ఇక్కడి భూములకు ఎంత డిమాండ్ ఉందో అర్థం చేసుకోవచ్చన్నారు. సాగునీటిని ఆదా చేసి, భావితరాలకు అందించాలని స్పీకర్ ప్రసాద్ కుమార్ అన్నారు. జిల్లాకు సాగునీరు వచ్చేలా చూడాలని మంత్రి తుమ్మలను కోరారు. వ్యవసాయ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి మాట్లాడుతూ పంటల సాగులో రసాయనాలను తగ్గించాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కమిషన్ సభ్యుడు సునీల్, వ్యవసాయ విశ్వవిద్యాలయ వీసీ అల్తాఫ్ జానయ్య, కమిషనర్ గోపి, డైరెక్టర్ విజయకుమార్, కలెక్టర్ ప్రతీక్‌జైన్ పాల్గొన్నారు. అనంతరం 'రైతు ముంగిట శాస్త్రవేత్తలు'అనే కరపత్రాలను ఆవిష్కరించారు.



విజయ్‌దేవరకొండపై ఫిర్యాదు చేస్తున్న గిరిజన సంఘాల నాయకులు

విజయ్ దేవరకొండపై ఫిర్యాదు

కుల్కచర్ల: సినీ హీరో విజయ్ దేవరకొండ గిరిజనులకు క్షమాపణలు చెప్పాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ డిమాండ్ చేశారు. రెట్రో సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో విజయ్ గిరిజనులపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ సోమవారం కుల్కచర్ల ప్రధాన చౌరస్తాలో నిరసన తెలిపి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గిరిజనులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన విజయ్ దేవరకొండ వెంటనే క్షమాపణలు చెప్పాలని, లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అందరికీ ఆదర్శంగా ఉండాల్సిన హీరో వెనుకబాటుకు గురైన వర్గాన్ని కించపరిచేలా మాట్లాడటం సరైంది కాదన్నారు. ఇకపై ఇలాంటి వ్యాఖ్యలు చేయడం మానుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో సేవాలాల్ సేన మండల అధ్యక్షుడు అంగూర్ నాయక్, నాయకులు చిట్టు నాయక్, గణేశ్‌నాయక్, హన్మ్యనాయక్, రవి నాయక్, అరుణ్, శ్రీను, గోపాల్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు భూధార్ కార్డులు

- మండల వ్యవసాయాధికారి కొమరయ్య
- ఏఈఓలకు వివరాలు అందజేయాలని అన్నదాతలకు సూచన

తాండూరు రూరల్: ఆధార్ తరహాలో కేంద్ర ప్రభుత్వం ప్రతి రైతుకూ 11 అంకెలతో కూడిన యూనిక్ కోడ్(భూధార్ కార్డు)ను కేటాయిస్తుందని మండల వ్యవసాయాధికారి కొమరయ్య తెలిపారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు.. వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించగా రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టును చేపడుతోందన్నారు. రైతు యూనిక్ కోడ్ పొందాలంటే ఆధార్‌కార్డుతో పాటు లింక్ చేసిన సెల్‌ఫోన్ నంబర్, పట్టాదారు పాసుపుస్తకం కలిగి ఉండాలన్నారు. ఈ ఫార్మర్ రిజిస్ట్రీ రైతు పేరు, ఆధార్, గ్రామం, భూముల సర్వే నంబర్లు, విస్తీర్ణం, సెల్ ఫోన్ నంబర్ తదితర వివరాలను నమోదు చేస్తే రైతుకు గుర్తింపు సంఖ్య వస్తుందన్నారు. రైతు వేదికలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, మున్సిపల్ వార్డు కార్యాలయాల్లో సంబంధిత ఏఈఓలకు పై పేర్కొన్న వివరాలు అందజేయాలని రైతులకు సూచించారు. ఫార్మర్ రిజిస్ట్రీలో రైతులు తమ వివరాలు నమోదు చేస్తేనే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసే పీఎం కిసాన్ నిధులు వస్తాయన్నారు. అన్నదాతలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.



మాట్లాడుతున్న ఏఓ కొమరయ్య

ఘన నివాళి

అనంతగిరి: తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి గిరిజ ప్రియదర్శిని అకాల మరణం పట్ల సోమవారం వికారాబాద్ కోర్టులో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది రెండు నిమిషాలు మౌనం పాటించి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆమె చేసిన సేవలను కొనియాడారు. గతంలో వికారాబాద్ జిల్లా కోర్టుకు పోర్ట్‌పోలియోగా కూడా పనిచేశారు. వికారాబాద్ కోర్టుకు ఆమె చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి సున్నం శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అదనపు న్యాయమూర్తి చంద్రకిశోర్, సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వర్లు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శాంతిలత, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బస్వరాజ్ పటేల్, ప్రధాన కార్యదర్శి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు శంకరయ్య, పలువురు సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాస్‌రెడ్డి

లగచర్లలో టెన్షన్.. టెన్షన్

- పోలీస్ పహారాలో భూ సర్వే ప్రక్రియ పూర్తి
- ఊపిరి పీల్చుకున్న అధికారులు



లగచర్లలో మోహరించిన పోలీసులు

కొడంగల్: దుద్యాల్ మండలం లగచర్ల, పోలేపల్లి, హకీంపేట, రోటిబండ, పులిచర్ల కుంట తండాల్లో పారిశ్రామిక వాడ ఏర్పాటుకు ప్రభుత్వం గతంలో నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో భాగంగా సోమవారం లగచర్ల, హకీంపేట గ్రామాల్లో భూములు ఇవ్వడానికి సమ్మతించిన రైతుల పట్టా భూముల్లో సర్వే చేపట్టారు. తహసీల్దార్ కిషన్ నాయక్ ఆధ్వర్యంలో తొమ్మిది సర్వే నంబర్లలోని 85 ఎకరాల భూమిని సర్వే చేశారు. రైతులు చూపించిన హద్దులను గుర్తించి వారి సంతకాలు తీసుకున్నారు. భూములు ఇవ్వడానికి తాము సమ్మతిస్తున్నట్లు పలువురు ప్రకటించారు. భూములు ఇవ్వడానికి ముందుకు వచ్చిన వారి పొలాల్లో డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ శివకుమార్, సర్వేయర్లు మహేష్, కిరణ్, మహేష్‌కుమార్, ఆర్‌ఐ నవీన్‌లు సర్వే చేశారు. అయితే గతంలో జరిగిన పలు సంఘటనల నేపథ్యంలో లగచర్ల, హకీంపేట గ్రామాల్లో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఎస్పీ నారాయణరెడ్డి పర్యవేక్షణలో పారా మిలటరీ బలగాలతో పాటు సివిల్ పోలీసులను భారీగా మోహరించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. తహసీల్దార్ కిషన్‌నాయక్, డిప్యూటీ తహసీల్దార్ వీరేష్‌బాబులతో పాటు పోలీస్ సిబ్బందికి ఎస్పీ తగిన సలహాలు సూచనలు ఇచ్చారు. సర్వే ప్రశాంతంగా జరిగేలా చూడాలని ఆదేశించారు. దీంతో భూ సర్వే ప్రక్రియ ప్రశాంతంగా జరిగింది. గత అనుభావాల దృష్ట్యా అటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా పరిగి డివిజన్ పరిధిలోని పలు పోలీస్‌స్టేషన్ల నుంచి పోలీసులను రప్పించారు. పరిగి డీఎస్పీ శ్రీనివాస్, కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలు మండలాలకు చెందిన ఎస్‌ఐలు సత్యనారాయణ, యాదగిరి, రవిగౌడ్ భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సర్వేయర్లతో మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

అభివృద్ధి పనులను సత్వరం పూర్తి చేయండి


ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి

తాండూరు టౌన్: మున్సిపల్ పరిధిలోని చిలక వాగు, గొల్ల చెరువు ప్రక్షాళన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఇరిగేషన్, పంచాయతీ రాజ్, మున్సిపల్ అధికారులతో సమీ క్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిపై ఆరా తీశారు. పనుల్లో నిర్లక్ష్యాన్ని సహించేది లేదన్నారు. అనంతరం మండలానికి చెందిన 143 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు.

మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలిగా జానకి



అనంతగిరి: మహిళా పరస్పర సహాయ సహకార పొదుపు, పరపతి సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షురాలిగా జానకి ఎన్నికయ్యారు. సోమవారం వికారాబాద్‌లోని మహిళా సమాఖ్య భవనంలో ఎన్నికలు నిర్వహించారు. ఏకగ్రీవంగా ఎన్నికలు జరిగాయని పరిశీలకురాలు.. సెర్ప్ రాష్ట్ర ప్రతినిధి విజయలక్ష్మి తెలిపారు. సంఘం కార్యదర్శిగా శ్వేత(పరిగి), కోశాధికారి భాగ్యలక్ష్మి(మోమిన్‌పేట)ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరి పదవీకాలం మూడు సంవత్సరాలు ఉంటుంది. కార్యక్రమంలో డీపీఎం వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



బాచారంలో భూ భారతి కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

అంకితభావంతో పనిచేయండి

కలెక్టర్ ప్రతీక్‌జైన్

ధారూరు: అధికారులు అంకితభావంతో పని చేసి భూ భారతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాల ని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. సోమవారం మండలంలోని బాచారం, అవుసుపల్లి గ్రామాల్లో నిర్వహించిన భూ భారతి అవగాహన సదస్సులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతుల నుంచి వస్తున్న సమస్యలను తహసీల్దార్లను అడిగి తెలుసుకున్నారు. భూ సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రతి అర్జీనీ స్వీకరించాలని ఆదేశించారు. అవుసుపల్లికి చెందిన 11మంది, బాచారం గ్రామానికి చెందిన 16 మంది భూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులు అందజేశారు. మంగళవారం కా చారం, అంపల్లి గ్రామాల్లో భూ భారతి సదస్సులు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, ఆర్డీఓ వాసుచంద్ర తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

అనంతగిరి: కేంద్ర ప్రభుత్వం జిల్లాలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పారిశ్రామిక రంగాల పనితీరు మెరుగు పర్చేందుకు జిల్లా పరిశ్రమల కేంద్రంలో మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్ పోస్టులను మంజూరు చేసిందని, వీటి కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేస్తామని తెలిపారు. మే 10వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. మరిన్ని వివరాలకు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. ఎస్‌ఐఎంఎస్‌ఈ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో అలాగే సెల్ నంబర్ 8688921546లో సంప్రదించాలన్నారు.

న్యూస్‌రీల్

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శ్రీదేవి

తాండూరు రూరల్: మండలంలోని జినుగుర్తి గేటు సమీపంలో ఉన్న తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీదేవి సూచించారు. సోమవారం ఆమె మాట్లాడుతూ.. ఫస్టియర్‌లో ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో 40 సీట్ల చొప్పున ఖాళీలు ఉన్నాయన్నారు. పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు మంగళవారం నుంచి ఆన్‌లైన్‌లో ఈ నెల 20వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. కళాశాలలో అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్‌బుక్స్ అందజేస్తామన్నారు. బాలికలకు హాస్టల్ వసతి ఉందన్నారు. కళాశాలలో అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉన్నారని, ప్రతి ఏటా మంచి ఫలితాలు వస్తున్నాయని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు.

కేజీబీవీలో ప్రవేశాలకు..

దోమ: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో 2025 – 26 విద్యా సంవత్సరానికి గాను ఆరో తరగతిలో, ఇంటర్ మొదటి సంవత్సరం, ఎంపీహెచ్‌డబ్ల్యూ గ్రూపులో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ వెంకట్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో 40 సీట్లు, సీఈసీలో 40 సీట్లు, ఎంపీహెచ్‌డబ్ల్యూలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆధార్‌కార్డు, రెండు పాస్ సైజ్ ఫొటోలు, పదో తరగతి మెమో జిరాక్స్, కులం సర్టిఫికెట్ జిరాక్స్‌ను దరఖాస్తు ఫారానికి జతచేసి పాఠశాలలో సమర్పించాలని తెలిపారు.

నేడు రాజీవ్ యువ వికాస్ లబ్ధిదారులకు ఇంటర్వ్యూలు

నవాబుపేట: మండలంలోని ఎల్లకొండ కెనరా బ్యాంకులో రాజీవ్ యువ వికాస్ పథకం కింద రుణాల కోసం, దరఖాస్తు చేసుకున్న వారికి మంగళవారం ఉదయం 10 గంటల నుంచి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అనురాధ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎల్లకొండ బ్యాంక్ పరిధిలోకి వచ్చే గ్రామాలైన ఎల్లకొండ గొల్లగూడ, ముబారక్‌పూర్, ఉబ్బడిపత్తేపూర్, మైతాప్‌ఖాన్‌గూడ గ్రామాలకు చెందిన లబ్ధిదారులు రేషన్‌కార్డు, ఆధార్, కుల, ఆదాయ, బ్యాంక్ పాస్‌బుక్‌లతో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆమె సూచించారు.

మూఢ విశ్వాసానికి బాలుడి బలి

- నాగుపాము కాటేయడంతో మంత్రగాడిని ఆశ్రయించిన వైనం
- పరిస్థితి విషమించడంతో చిన్నారి మృతి



శివకుమార్ (ఫైల్)

దోమ: తల్లిదండ్రుల మూఢ విశ్వాసం ఓ బాలుడి నిండు ప్రాణాన్ని బలి తీసుకుంది. పాఠశాలలకు సెలవులు కావడంతో ఇంటికి వచ్చిన చిన్నారి పాము కాటుకు గురై మృతిచెందాడు. ఈ ఘటన దోమ మండలం బాస్‌పల్లిలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన చాకలి రాములు, సువర్ణకు ముగ్గురు కుతుళ్లు, ఓ కుమారుడు. చిన్నవాడైన చాకలి శివకుమార్(11) పరిగి పట్టణంలోని మహాత్మ జ్యోతిబా పూలే పాఠశాలలో 6వ తరగతి పూర్తి చేసుకుని, సెలవులు కావడంతో ఇంటికి వచ్చాడు. ఉదయం పది గంటలకు తాతతో కలిసి పొలానికి వెళ్లాడు. ఈ క్రమంలో నాగుపాము అతన్ని కాటేసింది. గమనించి బాలుడు కుటుంబ సభ్యులకు చెప్పడంతో..మంత్రతంత్రాలతో బాగవుతుందని దొంగఎన్కేపల్లికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో పరిగి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా బాలుడు అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఒక్కగానొక్క కొడుకు మృతితో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లి ఉంటే బాలుడు బతికే వాడని స్థానికులు ఆవేదన వ్యక్తంచేశారు.

పశువులకు టీకాలు

షాబాద్: పశువులకు వచ్చే సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రేగడిదోస్వాడ, షాబాద్ పశువైద్యాధికారులు చంద్రశేఖర్‌రెడ్డి, స్రవంతి రైతులకు సూచించారు. సోమవారం మండల పరిధిలోని తిమ్మారెడ్డిగూడ గ్రామంలో ఉచితంగా గాలికుంటు నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతులు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని సూచించారు.

క్లుప్తంగా

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

డాక్టర్ న్యూటన్ కొండవీటి



ఎల్లమ్మ తల్లి ఆలయంలో డాక్టర్ న్యూటన్ కొండవీటి తదితరులు

బంట్వారం: ఆధ్యాత్మిక చింతన, ధ్యానంతో మానసిక ప్రశాంతత, సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని లైఫ్ యూనివర్సిటీ నిర్వాహకులు డాక్టర్ న్యూటన్ కొండవీటి అన్నారు. సోమవారం ఆయన కోట్‌పల్లి మండలంలోని ఎల్లమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత దురలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. ఆలయ ప్రాంగణంలో ఆయన గంటపాటు ధ్యానం చేశారు. ఈ కార్యక్రమంలో లైఫ్ యూనివర్సిటీ నిర్వాహకులు డాక్టర్ లక్ష్మి, ప్రతినిధులు పవణ్ కుమార్, హారిక, సూరి, నిర్మళ, సూరారెడ్డి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ లఘు చిత్రం 'అక్షరమే ఆధారం'



అవార్డు అందుకుంటున్న దర్శకుడు టీవీ రంగయ్య

షాద్‌నగర్‌రూరల్: దర్శకరత్న దాసరి నారాయణరావు జయంతిని పురస్కరించుకుని టాలీవుడ్ క్రియేటివ్ డైరెక్టర్స్ అసోసియేషన్, రెయిన్‌బో చిల్డ్రన్స్ సంస్థ ఆధ్వర్యంలో నగరంలోని రవీంద్ర భారతిలో ఆదివారం రాత్రి రాష్ట్రస్థాయి లఘు చిత్రాల పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో షాద్‌నగర్‌కు చెందిన టీవీ రంగయ్య నటించి దర్శకత్వం వహించిన అక్షరమే ఆధారం షార్ట్ ఫిలింను ప్రదర్శించారు. ఈ చిత్రం ఉత్తమ సందేశాత్మక లఘుచిత్రంగా ఎంపికైంది. ఈ సందర్భంగా రెయిన్‌బో సంస్థ డైరెక్టర్ మోహన్ ఉత్తమ లఘు చిత్రం అవార్డును టీవీ రంగయ్యకు అందజేశారు.

టిప్పర్ ఢీకొని పశువుల కాపరి దుర్మరణం



రవి (ఫైల్)

తాండూరు రూరల్: టిప్పర్ ఢీకొని ఓ పశువుల కాపరి మృతి చెందాడు. ఈ ఘటన పెద్దేముల్‌లో సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన బుర్జుపూరి రవి(41) అవివాహితుడు. అదే గ్రామానికి చెందిన బాలేసాబ్ దగ్గర పశువుల కాపరిగా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే పశువులను మేపేందుకు పెద్దచెరువు వద్దకు వెళ్లాడు. గ్రామానికి చెందిన ముక్రాంఖాన్ తన టిప్పర్‌లో పెద్ద చెరువు నుంచి మట్టి తరలిస్తున్నాడు. డ్రైవర్ నిర్లక్ష్యంగా, అజాగ్రత్తగా వాహనాన్ని నడుపుతూ పశువుల కాపరి రవిని ఢీకొట్టంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని వెంటనే తాండూరు జిల్లా ఆస్పత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి సోదరుడు ఎల్లప్ప టిప్పర్ యజమాని ముక్రాంఖాన్, డ్రైవర్‌పై చర్యలు తీసుకోవాలని పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

'రుణం' తీరదా..?

- ఆరు నెలలుగా మాఫీ కోసం రైతుల ఎదురు చూపులు
- నాలుగు విడతల్లోనూ నిరాశే
- బ్యాంకులు, వ్యవసాయ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు



పరిగి: ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల ముందు రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ చేస్తామని ప్రకటించింది. అనంతరం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ చేసిన మాఫీ సగం మంది రైతులకే మేలు చేకూరింది. 2018 డిసెంబర్ నుంచి 2023 డిసెంబర్ వరకు రూ.1.80 లక్షల మంది రైతులు వివిధ బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా నాలుగు విడతల్లో కలిపి 1,00,358 మంది రైతులకు గాను రూ.849 కోట్ల రుణమాఫీ అయింది. తీసుకున్న రుణాలకు వడ్డీ చెల్లించిన రైతులు, రూ.2 లక్షలకు మించి రుణం తీసుకున్న రైతులు పైనున్న అప్పును కట్టినా మాఫీ అవడం లేదని ఆందోళన చెందున్నారు. ప్రభుత్వం రూ.2 లక్షల వరకు పూర్తిగా రుణమాఫీ చేశామని చెబుతున్నా క్షేత్రస్థాయిలో లబ్ధి చేకూరని రైతులు వేలల్లో ఉన్నారు. అర్హుల వివరాలు సేకరించిన అధికారులు మాత్రం రుణమాఫీ ఎందుకు కాలేదో చెప్పడం లేదని రైతులు వాపోతున్నారు. నిబంధనలు లేవని చెబుతూనే కొర్రీలు పెట్టి రైతులను ఇబ్బంది పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

టెక్నికల్ సమస్యలే అనేకం

కుటుంబ నిర్ధారణ కాని రైతులు, ఆధార్ కార్డులో తప్పులు, పంట రుణం తీసుకున్న ఖాతాపై ఒక పేరు, ఆధార్ కార్డుపై మరో పేరు ఉన్న రైతులు, భార్యాభర్తల పేరిట భూమి ఉండి ఇద్దరి పేరుతో రూ.2 లక్షలపై తీసుకున్న రుణాలు, సరైన వివరాలు తేలని రైతుల పంట రుణాలు మాఫీ కాలేదు. నాలుగు విడతల్లో రుణమాఫీ కాలేదని రైతులు అధికారులు, బ్యాంకుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని రైతులు వేడుకుంటున్నారు.

అప్పు చేసి కట్టినం



రూ.1.90లక్షల పంట రుణం తీసుకున్నాం. వడ్డీతో కలిపి రూ.2.50లక్షలు అయింది. రూ.2 లక్షలకు పైగా ఉంటే మాఫీ చేస్తుందంటే రూ.50 వేలు అప్పు తీసుకుని రుణం చెల్లించాం. ఇప్పటి వరకు మాఫీ చేయలేదు.

– పొనెమోని బుగ్గమ్మ, ఇప్పాయిపల్లి, కుల్కచర్ల

పేరు లేదు



రెండు బ్యాంకుల్లో కలిపి పంట రుణం రూ.90వేలు తీసుకున్నాం. ప్రభుత్వం రుణమాఫీ చేస్తుందని ఆశించాం. నాలుగు విడతల్లోనూ మా పేరు లేదు. బ్యాంకు, వ్యవసాయధికారి కార్యాలయాల చుట్టూ తిరిగినా రుణమాఫీ కాలేదు. చేసేదేమీ లేక తీసుకున్న రుణం చెల్లించాం.

– బిచ్చన్న, ఐనాపూర్, దోమ

అర్హులందరికీ మాఫీ

రూ.2 లక్షల వరకు రుణం తీసుకుని అర్హులైన వారందరికి రుణమాఫీ అయింది. నాలుగు విడతల్లో ప్రభుత్వం జిల్లాలో 1,00,358 మంది రైతులకు రూ.849 కోట్ల రుణం కట్టింది. తప్పులు ఉన్న రైతుల వివరాలను ఉన్నత అధికారులకు పంపించి మాఫీ చేయించాం. మిగతా రైతుల గురించి ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాచారం లేదు.

– మోహన్‌రెడ్డి, జిల్లా వ్యవసాయధికారి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

తెలంగాణ కులగణన దేశానికే ఆదర్శం

పరిగి ఎమ్మెల్యే డాక్టర్ రామ్మోహన్ రెడ్డి

పరిగి: లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆలోచన విధానం.. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే దేశానికి ఆదర్శంగా నిలిచిందని పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం జనాభా లెక్కలతో పాటు కులగణన చేపడతామని కేంద్ర కేబినెట్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. రాహుల్ గాంధీ జోడో యాత్ర చేపట్టిన సమయంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే కులగణన చేపట్టి రిజర్వేషన్లు పెంచుతామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కులగణన చేపట్టి 42శాతం రిజర్వేషన్ల బిల్లును అసెంబ్లీలో ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపించారని వివరించారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిరండి

ఈ నెల 7న ఉదయం 11 గంటలకు వికారాబాద్ పట్టణ కేంద్రంలోఎన్నెపల్లి చౌరస్తాలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు పెద్ద ఎత్తున తరలిరావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. స్పీకర్ ప్రసాద్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరవుతారని చెప్పారు. మధ్యాహ్నం 3గంటలకు విగ్రహావిష్కరణ అనంతరం సత్యభారతి ఫంక్షన్‌హాల్ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ –ఎ అధ్యక్షుడు పార్థసారథి పంతులు, మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కృష్ణ, దోమ మండల అధ్యక్షుడు విజయకుమార్ రెడ్డి, మాజీ ఎంపీపీ సత్యనారాయణ, మత్స్యకార సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు, రాఘవేందర్ రెడ్డి, యాదయ్య గౌడ్, మాజీ కౌన్సిలర్ మల్లేష్, వెంకటేష్, శశిధర్ రెడ్డి, శ్రీనివాస్, మాధవరెడ్డి, ఆరిఫ్, పటేల్, నేపాల్ రెడ్డి, రవీందర్, పులిందర్, మహేష్, బాలు, లక్ష్మణ్ పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తున్న ఎంపీ డాక్టర్ మల్లురవి

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి

కద్తాల్: రైతు సంక్షేమం, ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తోందని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి అన్నారు. మండల కేంద్రంతో పాటు, మండల పరిధిలోని ముద్విన్ గ్రామంలో పీఏసీఎస్ ఆమనగల్లు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం రైతన్నలకందిస్తున్న చేయూతతో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని తెలిపారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని రైతులు దళారులకు విక్రయించి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని స్పష్టం చేశారు. ప్రతిపక్షాలు చేస్తున్న అబద్ధపు ప్రచారాలను నమ్మొద్దన్నారు. వరి ధాన్యానికి ప్రభుత్వం క్వింటాలుకు రూ.2,320 మద్దతు ధర నిర్ణయించిందని, సన్నరకం ధాన్యానికి క్వింటాలుకు రూ.500 బోనస్ అందిస్తోందని వివరించారు. కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీబీ చైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ గంప వెంకటేశ్‌గుప్తా, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ యాట గీత, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, సింగిల్‌విండో వైస్ చైర్మన్ సత్యం, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కద్తాల్, తలకొండపల్లి మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు బీచ్యానాయక్, ప్రభాకర్‌రెడ్డి, పీఏసీఎస్ సీఈఓ దేవేందర్, మండల వ్యవసాయ అధికారులు శ్రీలత, అరుణకుమారి పాల్గొన్నారు.

అసైన్డ్ పట్టాకు పొజిషన్ చూపండి

రెవెన్యూ సదస్సులో మహిళ వినతి

ధారూరు: తనకు ప్రభుత్వం 2012లో ఇచ్చిన ఎకరా భూమికి సంబంధించిన పొజిషన్ చూపించలేదని, ఇప్పటికైనా తన సమస్యను పరిష్కరించాలని ఓ మహిళా రైతు కోరింది. ఈ మేరకు సోమవారం అవుసులపల్లిలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో అధికారులకు దరఖాస్తు అందజేసింది. అయితే తన అభ్యర్థనను పట్టించుకోని తహసీల్దార్ సాజిదా బేగం, పరిగి డిప్యూటీ తహసీల్దార్ అనిల్‌బాబు తన దరఖాస్తును టేబుల్‌పై విసిరేశారని బాధితురాలు ఆవేదన వ్యక్తంచేసింది. భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుండగా అధికారులు ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఏమిటని పలువురు రైతులు ఆందోళన వ్యక్తంచేశారు. ఈ విషయమై ధారూరు డిప్యూటీ తహసీల్దార్ విజయేందర్ మాట్లాడుతూ.. రైతుల నుంచి వచ్చిన ప్రతీ దరఖాస్తును తీసుకుని, తగిన రిసిప్ట్ ఇస్తామని తెలిపారు. సంబంధిత మహిళను పిలిచి, మరోసారి దరఖాస్తు ఇవ్వమని సూచించారు.

'క్షయ'పై అప్రమత్తత అవసరం



టీబీ నిరోధక టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

కుల్కచర్ల: క్షయ వ్యాధిపై ప్రతీ ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని టీబీ హెల్త్ విజిటర్ రాజు అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఆధ్వర్యంలో టీబీ వ్యాధిగ్రస్తుల నివాసానికి వెళ్లి వారి కుటుంబ సభ్యులకు, సహచరులకు టీబీ నిరోధక టీకాలు ఇచ్చారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. క్షయ సోకిన వారు జాగ్రత్తలు పాటించకుంటే ఇతరులకు సోకే ప్రమాదం ఉంటుందన్నారు. ముందస్తు టీకాతో వ్యాధి నిరోధించే అవకాశం ఉంటుందని చెప్పారు. పౌష్టికాహారం తీసుకుంటూ.. వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫాతిమా తదితరులు పాల్గొన్నారు.

ఆ రోడ్డుకు బిల్లు మంజూరు చేయొద్దు

ధారూరు: స్థానిక పోలీస్‌స్టేషన్ ఆవరణ చుట్టూ దాతల సహాయంతో నిర్మించిన సీసీ రోడ్డుకు ప్రభుత్వ నిధులను డ్రా చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని ధారూరుకు చెందిన ఎస్‌కే.ఆశం సోమవారం ఎస్పీ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆ బిల్లును నిలిపివేయాలని కోరారు. ఈ రోడ్డు నిర్మాణంపై ప్రభుత్వం నుంచి రూ.22 లక్షలు తీసుకునేందుకు ఇద్దరు నాయకులు ఇంజనీరింగ్ అధికారులపై ఒత్తిడి తీసుకువస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వ హయాంలో ఎస్ఐ సంతోష్ కుమార్, సీఐ రామకృష్ణ దాతల చొరవతో సీసీ రోడ్డు వేశారని ఎస్పీ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై విచారణ జరిపించి, బిల్లులు మంజూరు కాకుండా చూడాలని ఆయన కోరారు.

సాగుపై అవగాహన పెంచుకోవాలి



మాట్లాడుతున్న నర్సింహారావు

యాచారం: ఆధునిక పద్ధతుల్లో పంటల సాగుకు రైతులు అవగాహన, చైతన్యం పొందాలని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ విశ్వ విద్యాలయం శాస్త్రవేత్త ఏకాద్రి పేర్కొన్నారు. మండల పరిధిలోని గడ్డమల్లయ్యగూడలో సోమవారం 'రైతు ముగింట్లో శాస్త్రవేత్తలు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంటల సాగులో ఎరువుల యాజమాన్యంపై రైతులు అవగాహన కలిగి ఉండాలని అన్నారు. తక్కువ యూరియా, అవసరం మేరకు రసాయనాల వినియోగంతో నేలతల్లిని కాపాడుకోవాలన్నారు. రైతులు కొనుగోలు చేసే విత్తనాలు, ఎరువుల రసీదులను జాగ్రత్తగా దాచి పెట్టుకోవాలని చెప్పారు. రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ డైరెక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. నకిలీ విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరిలో రకాలు, కొత్తరకం వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు మాట్లాడుతూ.. ఈ నెల 31 వరకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు నమోదు కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. రైతు నమోదు కార్యక్రమానికి పట్టాదారు, పాసుపుస్తకం, ఆధార్ కార్డుకు లింకు ఉన్న ఫోన్ నంబర్ వివరాలతో రైతు వేదికల వద్దకు వచ్చి వివరాలు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం డివిజన్ ఏడీఏ సుజాత, యాచారం పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి, యాచారం మండల వ్యవసాయాధికారి రవినాథ్ తదితరులు పాల్గొన్నారు.

కేక్ కోసం వెళ్లి.. ప్రమాదానికి గురై

ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలు



గాయపడిన యువకుడు

బొంరాస్‌పేట: మండల పరిధిలోని తుంకిమెట్ల వద్ద జాతీయ రహదారి 163పై ఉన్న కల్వర్టు వద్ద సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ఇద్దరు యువకులు తీవ్రగాయాలై ఆస్పత్రిలో చేరారు. స్థానికుల వివరాల ప్రకారం.. దుద్యాల్ మండల కేంద్రానికి చెందిన భరత్ పుట్టినరోజు కావడంతో కేక్ కోసం బొంరాస్‌పేటకు ద్విచక్రవాహనంపై తన స్నేహితుడు అనంతరాములుతో వెళ్తున్నాడు. తుంకిమెట్ల బ్రిడ్జి వద్ద మరమ్మతులకు రహదారిని తవ్వారు. ఇది గమనించని యువకులు ప్రమాదానికి గురయ్యారు. గాయాలు కావడంతో మండల కేంద్రం ఆస్పత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

ఇబ్రహీంపట్నం రూరల్: ఆటో ఢీకొట్టడంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం వెలుగులోకి వచ్చింది. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపిన ప్రకారం.. లేబర్ పని చేస్తూ జీవనం సాగిస్తున్న జర్పుల మోతీలాల్(52) ఈ నెల 3న ఉదయం 8.30 గంటల ప్రాంతంలో తుర్కయంజాల్‌లో లేబర్ అడ్డాకు వెళ్లాడు. అదే రోజు సుభాష్‌నగర్ కాలనీ రోడ్డు నుంచి అక్షర స్టీల్ షాప్ ఎదుట రోడ్డు దాటుతుండగా ఓ ఆటో ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని 108 వాహనంలో ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన ఆదివారం మృతి చెందాడు. రెండు రోజులుగా మోతీలాల్ ఇంటికి రాకపోవడంతో ఆయన కుమారుడు మోహన్ సోమవారం ఆదిబట్ల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. కేసు దర్యాప్తులో ఉంది.

పౌల్ట్రీ ఫాంలో కార్మికుడి మృతి

మొయినాబాద్: మద్యం మత్తులో కింద పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధి చిలుకూరులో సోమవారం వెలుగుచూసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విజయనగరం జిల్లా కోస్తు వలసకు చెందిన వేణుగోపాల్‌రావు(46) తన తమ్ముడు లక్ష్మణ్‌తో కలిసి రెండు నెలల క్రితం చిలుకూరుకు వలస వచ్చారు. స్థానికంగా ఓ పౌల్ట్రీ ఫాంలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆదివారం ఉదయం 6 గంటలకు లక్ష్మణ్ పనికి వెళ్లగా వేణుగోపాల్ బయటకు వెళ్లాడు. సాయంత్రం మద్యం మత్తులో వచ్చిన వేణు తమకు కేటాయించిన గది ఎదుట పడుకున్నాడు. తోటి కార్మికుడు సబిలాల్ సోమవారం ఉదయం నిద్రలేపేందుకు ప్రయత్నించగా ముఖంపై రక్తపు మరకలు కనిపించాయి. అతని నోరు, ముక్కునుంచి రక్తస్రావమైంది. ఈ విషయమై పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. లక్ష్మణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.



తియ్యని విషం!

మామిడి.. ఆరోగ్యంపై దాడి

- త్వరగా పక్వానికి వచ్చేలా వ్యాపారుల అడ్డదారులు
- యథేచ్ఛగా కార్బైడ్ వినియోగం
- తాజాగా కన్పించేందుకు వ్యాక్స్, సింథటిక్ కలర్లు
- రంగు చూసి కొంటే మోసపోయినట్లే..
- పట్టించుకోని అధికారులు



వినియోగిస్తున్న కార్బైడ్ పొట్లాలు



కార్బైడ్‌తో కలిపి ప్యాకింగ్

సాక్షి, రంగారెడ్డిజిల్లా: తీపిని పంచాల్సిన పండ్లు కడుపుల్లో విషాన్ని నింపుతున్నాయి. మామిడిప్రియుల ఆరోగ్యంపై దాడి చేస్తున్నాయి. రైతులు తమ పంటను పక్వానికి ముందే తెంపి మార్కెట్లోకి తరలిస్తున్నారు. సహజసిద్ధంగా పండాల్సిన పండ్లను కృత్రిమ పద్ధతి (త్వరగా పండేలా నిర్దేశిత ప్రమాణాలకు మించి క్యాల్షియం కార్బైడ్ వినియోగం)లో మగ్గబెడుతున్నారు. కంటికి అందంగా కన్పించేందుకు వ్యాపారులు వ్యాక్స్, సింథటిక్ కలర్లు అద్దుతున్నారు. వెరసి తరచూ వీటిని కొనుగోలు చేసి తిన్నవారికి ఆరోగ్య సమస్యలు (జీర్ణకోశ, శ్వాసకోశ, నాడీ సంబంధిత సమస్యలు, చర్మంపై దద్దుర్లు) తప్పడం లేదు. ఎప్పటికప్పుడు ఆయా మార్కెట్లలో తనిఖీలు నిర్వహించి, పండ్ల నాణ్యతను పరిశీలించాల్సిన మార్కెటింగ్, ఫుడ్ సేఫ్టీ అధికారులు కానీ, తూనికలు కొలతల అధికారులు కానీ అటు వైపు తొంగిచూసిన దాఖలాలు లేవు. దీంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మార్కెట్‌కు వచ్చిన కాయలను త్వరగా మగ్గించి, అంతే త్వరగా సొమ్ము చేసుకోవాలనే ఉద్దేశంతో సామర్థ్యానికి మించి రసాయనాలు వాడుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు.

తిన్న తర్వాత రుచీపచీ లేక..

విపరీతమైన మంచు కారణంగా పూత దశలోనే చాలా వరకు పంట దిగుబడి తగ్గింది. అంతో ఇంతో కాసిన కాయలు ఇటీవల ఈదురుగాలులతో కూడిన వర్షాలకు నేలరాలాయి. డిమాండ్ మేరకు ఉత్పత్తి లేకపోవడంతో వ్యాపారులు అడ్డదారులు తొక్కుతున్నారు. కాయలు పక్వానికి రాకముందే వివిధ రసాయనాలు చల్లి మగ్గిస్తున్నారు. మార్కెట్లో కృత్రిమ కొరత సృష్టించి ధరలు అమాంతం పెంచేశారు. బహిరంగ మార్కెట్లో గత ఏడాది కిలో రూ.40 నుంచి రూ.60కే లభించిన పండ్లు ప్రస్తుతం రూ.80 నుంచి రూ.100కుపైగా విక్రయిస్తున్నారు. వీధుల్లో తోపుడు బండ్లపై/మార్కెట్లో కంటికి అందంగా, సువాసన వెదజల్లుతూ కన్పించే ఈ పండ్లను తినేందుకు పిల్లలతో పాటు పెద్దలు సైతం ఇష్టపడుతుంటారు. ధర ఎక్కువగా ఉన్నప్పటికీ కొనుగోలు చేస్తున్నారు. తీరా తిన్న తర్వాత రుచి లేకపోవడంతో ఉసూరుమంటున్నారు. కృత్రిమ పద్ధతిలో మగ్గించిన ఈ పండ్లను తరచూ తిన్నవారు అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చేరుతుండటం ఆందోళన కలిగిస్తోంది.

ఏది సహజమో..? ఏది కృత్రిమమో..?

సహజంగా పండిన పండు ఆకుపచ్చ, పసుపు పచ్చ రంగు మిశ్రమంతో కనిపిస్తుంది. ఇది సువాసన వెదజల్లుతుండటంతో పాటు పుల్లగా, తియ్యగా, రుచిగా ఉంటుంది. నీళ్లలో వేస్తే మునిగిపోతోంది. రసాయనాలతో పండిన పండుకు ఎలాంటి వాసన ఉండదు. రుచి, సుచి లేకుండా తింటే చప్పగా ఉంటుంది. పూర్తిగా పసుపు పచ్చ రంగులో కన్పించడంతో పాటు నీటిలో ఇట్టే తేలిపోతుంది. వ్యాపారులు సామర్థ్యానికి మించి రసాయనాలను వినియోగించినట్లు ధృవీకరిస్తే.. వారికి రూ.ఏడు లక్షల జరిమానాతో పాటు మూడేళ్ల జైలు శిక్ష విధించే అవకాశం ఉంది. ఫుడ్ సేఫ్టీ, తూనికలు కొలతల అధికారులు మార్కెట్లలో తనిఖీలు నిర్వహించాల్సి ఉన్నా కమిషన్ ఏజెంట్లు, వ్యాపారులు ఇచ్చే కమీషన్లకు కక్కుర్తిపడి పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి.

ఆ రసాయనాలతో అనర్థాలు

మామిడి పండ్లు త్వరగా మగ్గించడానికి కాల్షియం కార్బైడ్‌ను వినియోగిస్తుంటారు. ఎఫ్‌ఎస్ఎస్ఐ వంటి ప్రభుత్వ సంస్థలు సైతం దీన్ని నిర్దేశిత ప్రమాణాల మేరకు వాడుతుంటాయి. అవగాహన లోపానికి తోడు మార్కెట్లో నాణ్యమైన రసాయనాలు లేకపోవడంతో మెజార్టీ వ్యాపారులు తక్కువ ధరకు దొరికే కార్బైడ్‌ను వినియోగిస్తున్నారు. నిజానికి ఈ రసాయనాలను కాయకు తగలకుండా ప్రత్యేకంగా తయారు చేయించిన బాక్స్‌లో పెట్టి ఉంచాలి. చాలావరకు ఈ పౌడర్‌ను మామిడికాయల బాక్సుల్లో పొట్లాలు కట్టి ఉంచుతున్నారు. ఆ ప్యాకెట్‌ను నీటితో తడిపి పెడుతుండటంతో రసాయన ద్రావణం కాయపై పడుతోంది. గాలి చొరబడకుండా గడ్డి/పేపర్‌ను కప్పి ఉంచుతుండటంతో క్యాల్షియం కార్బైడ్ అసిటిలీన్ వాయువును విడుదల చేస్తుంది. ఇది అత్యధిక వేడిని కలిగిస్తుంది. వారం రోజుల్లో పండాల్సిన దాన్ని 12 నుంచి 24 గంటల్లోనే మగ్గిస్తుంది. అత్యంత చవకైనది కావడంతో వ్యాపారులు దీన్ని విరివిగా వినియోగిస్తున్నారు. కార్బైడ్‌లో ఆర్సెనిక్, పాస్ఫరస్ అవశేషాలు ఉండటంతో జీర్ణకోశ, నాడీ వ్యవస్థపై ప్రభావం చూపుతాయి. కొనుగోలుదారుల దృష్టిని ఆకర్షించేందు పండ్లు తాజాగా కలర్‌ఫుల్‌గా కన్పించేందుకు ఏకంగా వ్యాక్స్ కెమికల్స్‌తో పాటు, చైనా సింథటిక్ కలర్లు, కాయ ఎదుగుదలను ప్రోత్సహించే ఇథలిన్ వాయువును విడుదల చేసే ఎథేపాన్ వాడుతున్నారు. మోతాదుకు మించి వాడుతుండటంతో రుచి కూడా తగ్గిపోతోంది. పండ్లకు ఫంగస్ సోకకుండా ఉండేందుకు థియాబెండజోల్, కార్బెండజిమ్, సోడియం బైక్లోరైడ్ వంటి రసాయనాలు వినియోగిస్తున్నారు. ఇవి శ్వాసకోశ, చర్మ సంబంధిత సమస్యలకు దారితీస్తాయని వైద్యనిపుణులు సూచిస్తున్నారు.